సాక్షి ఖమ్మం

ఆదివారం । 20 । జూలై । 2025



... నక్షత్ర వనం

పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో నక్షత్రాలు, రాశుల వారీగా మొక్కలతో వనం ఏర్పాటుచేశారు. 8లో



ఫేక్ అకౌంట్లు.. వసూళ్లు

యువతుల చిత్రాలతో సామాజిక మాధ్యమాల్లో అకౌంట్లు రూపొందించి డబ్బు వసూలుచేస్తున్న యువకుడి వ్యవహారం వెలుగు చూసింది. 8లో

గరిష్టం / కనిష్టం

31° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశారు. అలాగే, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల నిత్యకల్యాణం జరిపించాక పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీకే కోఆర్డినేటర్‌గా సుచరితాదేవి



వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ టి.సుచరితాదేవి నియమితులయ్యారు. గతంలో కోఆర్డినేటర్‌గా ఉన్న రవికుమార్ అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు బదిలీ అయిన విషయం విదితమే. ఆ స్థానంలో హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి పోషకాహార విభాగాధిపతిగా ఉన్న సుచరితను నియమించారు. దీంతో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించగా కేవీకే శాస్త్రవేత్తలు, ఉద్యోగులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ మొక్క వద్ద డీఏఓ, తదితరులు

వైరారూరల్: రైతులు సంప్రదాయ పంటల స్థానంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తే దీర్ఘకాలం లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. వైరా మండలం ఖానాపురంలో సరిపూడి సతీష్, తదితర రైతుల క్షేత్రాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈమేరకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏఓ మయాన్ మంజుఖాన్, ఉద్యాన అధికారి వేణు, ఏఈఓ పరిటాల వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు అందగానే పరిష్కరిస్తున్నామని ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. వర్షాల నేపథ్యాన రైతులకు ఎదురయ్యే సమస్యలను ఉద్యోగుల దృష్టికి తీసుకురావాలని కోరారు. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, వంగిన స్తంభాల విషయమై సెక్షన్ ఆఫీసర్ లేదా లైన్‌మెన్‌కు తెలియజేస్తే సరిచేయిస్తామని వెల్లడించారు. ఈదురుగాలులు, వర్షాలతో స్తంభాలు దెబ్బతిన్నా, తీగలు తెగిపడినా సంబంధిత ఉద్యోగులకు తెలియజేస్తే ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఈమేరకు టోల్ ఫ్రీ నంబర్ 1912కు కూడా సమస్యలు తెలియజేయవచ్చని ఎస్ఈ ఓ ప్రకటనలో వివరించారు.

నైపుణ్యం.. కళాత్మకం



చెట్టుకు పదుల సంఖ్యలో వేలాడుతున్న గూళ్లు



గూడుపై చేరుతున్న పక్షులు



గూడు వద్దకు వస్తున్న పక్షి

ఓ ఇంజనీర్ ఇంటి నిర్మాణానికి ప్లాన్ గీస్తే మేస్త్రీలు పనులు చేపడుతారు. కానీ ఇక్కడ పిచ్చుకలు అన్నీ తామే అయి గూళ్లు నిర్మించుకుంటున్నాయి. గిజిగాడి గూళ్లుగా పిలిచే వీటిని పిచ్చుకలు ఒకే ఆకారంలో ఏర్పాటు చేసుకున్నాయి. ఇందుకు అవసరమైన గడ్డిపోచలను సేకరించి క్రమపద్ధతిలో నిర్మించిన గూళ్లను చూసిన వారు నైపుణ్యం, కళాత్మకత ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ పిచ్చుకల గూళ్లు చింతకాని మండలం నామవరంలోని ఓ చెట్టుపై కనిపించాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఇంకొన్ని ఎస్‌హెచ్‌జీలు



ప్రతీ మహిళను సంఘంలో చేర్పించేలా కసరత్తు

- అర్హులైన వారి గుర్తింపునకు కార్యాచరణ
- 100 రోజుల్లో 500 సంఘాల ఏర్పాటుకు నిర్ణయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా సాధికారతకు ఊతమిచ్చేలా మెప్మా(మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్) అధికారులు కీలక ముందడుగు వేశారు. ఇందులో భాగంగా కొత్త మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీలు) ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. నగరంలో 2లక్షలకు పైగా మహిళలు ఉంటే.. కేవలం 42 వేల మంది మాత్రమే ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉన్నారు. దీంతో ప్రభుత్వం అందించే పలు పథకాలకు దూరమవుతున్నందున అర్హులైన ప్రతీ మహిళను స్వయం సహాయక సంఘంలో చేర్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. తద్వారా వారిని ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించినట్లవుతుందని భావిస్తున్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన మహిళా శక్తి సంబురాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించిన నేపథ్యాన మెప్మా అధికారులు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

బృందాల ఏర్పాటు

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా లేని మహిళల గుర్తింపునకు మెప్మా అధికారులు సీఆర్‌పీ(కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్)లతో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు పేద, మధ్యతరగతి కుటుంబాలు ఉన్న ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలను గుర్తించాల్సి ఉంటుంది. ఈ విషయమై అధికారులు శనివారం బృందాలతో సమావేశమై రెండు రోజుల్లో మొదలుపెట్టాల్సిన సర్వేకు సంబంధించి సూచనలు చేశారు.

సర్వే ద్వారా గుర్తింపు

ఖమ్మం నగరంలో ఇప్పటికే 4,403 స్వయం సహాయక సంఘాల్లో 42,920 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. అయితే, నగరంలో 2లక్షలకు పైగా మహిళలు ఉన్నట్లు భావిస్తుండగా, ఇందులో సగం మంది కూడా సంఘాల్లో లేకపోవడంతో ఎక్కువ మందిని చేర్పించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు సంఘాల్లో సభ్యులుగా లేని మహిళల గుర్తింపునకు మెప్మా అధికారులు ఇంటింటి సర్వేకు కార్యాచరణ రూపొందించారు. మెప్మా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మహిళలు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారా, లేదా అని ఆరా తీసి లేని వారికి సంఘాల్లో చేరడం ద్వారా లాభాలను వివరిస్తారు. ఆపై ఇప్పటికే కొనసాగుతున్న సంఘాల్లో చేర్పించడమా, లేదా ఒకే ప్రాంతంలో ఎక్కువ మంది ఉంటే కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలా అన్నది నిర్ణయిస్తారు.

సంఘాల్లో చేరికతో మహిళలకు లబ్ధి



మహిళలు ఆర్థికంగా ఎదిగేలా మహిళా సంఘాలకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తోంది. ఈ రుణాలతో మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుచేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ఇదే సమయాన సంఘాల్లో సభ్యులుగా లేని వారి గుర్తింపునకు సర్వే చేయనున్నాం. తద్వారా వంద రోజుల్లో 500 సంఘాలను ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

సర్దుబాటులో పైరవీలకు తావులేదు..

- వంట ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్లు
- జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ



సింగారెడ్డిపాలెంలో బోధనను పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

నేలకొండపల్లి: అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే క్రమాన ఎలాంటి పైరవీలకు తావిచ్చేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ స్పష్టం చేశారు. మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ఆధారిత బోధనను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా నిర్వహిస్తామని, కలెక్టర్ పర్యవేక్షణలో ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. స్థానిక మండలం లేదా పక్క మండలం మొత్తంగా నియోజకవర్గ పరిధిలోనే టీచర్ల సర్దుబాటు చేస్తామని, డిప్యూటేషన్లలోనూ పైరవీలకు చోటు ఇవ్వబోమని వెల్లడించారు. కాగా, జిల్లాలో ఏఐ ఆధారిత బోధనకు 165 పాఠశాలలను ప్రతిపాదించామని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 40పాఠశాలల్లో విద్యార్థులు చేరలేదని, ఇదే సమయాన గతంలో మూతపడిన 15 పాఠశాలలను తిరిగి ప్రారంభించామని చెప్పారు. గత విద్యాసంవత్సరం 66 పాఠశాలల పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా త్వరలోనే హెచ్ఎంలు, మండల స్థాయి ర్యాంకర్లను సన్మానించనున్నట్లు డీఈఓ వెల్లడించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే, పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించేలా గ్రామ, మండల స్థాయి కమిటీలు పర్యవేక్షించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీకి త్వరలోనే గ్యాస్ కనెక్షన్లు సమకూరుస్తామని డీఈఓ తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ బి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాల పంట



డ్రోన్ ద్వారా పిచికారీ విధానాన్ని వివరిస్తున్న ఏఓ

కూసుమంచి: గుళికల యూరియా స్థానంలో ద్రవ రూపంలోని నానో యూరియా వాడకంతో అనేక లాభాలు ఉంటాయని ఏఓ వాణి తెలిపారు. కూసుమంచి మండలం పాలేరులో నానో యూరియా వినియోగంపై శనివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సాధారణ యూరియాలో 40 శాతం వరకు నత్రజని వినియోగ సామర్థ్యం ఉంటుండగా, నానో యూరియాతో 85 శాతం వరకు వినియోగం జరుగుతుందని తెలిపారు. దీన్ని నేరుగా మొక్కపై పిచికారీ చేయడం వల్ల సమర్థవంతంగా నత్రజని అందుతుందని, ఆపై పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని చెప్పారు. అనంతరం నానో యూరియాలో ఇతర ఎరువులు కలిపే విధానం, డ్రోన్ ద్వారా పిచికారీపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఏఈఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో వెంటిలేటర్లు మాయం

- రెండింటి జాడ లేకపోవడంతో విచారణ
- కోవిడ్ సమయాన రూ.11 లక్షల చొప్పున నిధులతో కొనుగోలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఐసీయూ, కార్డియాలజీ విభాగాల నుంచి రెండు వెంటిలేటర్లు మాయమయ్యాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూడడంతో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన శనివారం విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో ఎన్ని వెంటిలేటర్లు ఉండాలి, వీవీపీ నుంచి డీఎంఈ పరిధిలోకి వచ్చినప్పుడు ఎన్ని అప్పగించారు, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయనే కోణంలో వివరాలు సేకరించారు.

సర్వీసింగ్ కోసం వస్తే..

ఆస్పత్రిలో గతంలోనే ఉన్న వెంటిలేటర్లకు తోడు కరోనా సమయాన కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.11లక్షల చొప్పున పది కొనుగోలు చేశారు. వీటిని సమకూర్చిన హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ యాపిల్ మెడికల్ సిస్టమ్స్ కంపెనీ బాధ్యులే కొన్నేళ్ల పాటు నిర్వహణ బాధ్యత చూడాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే నెలలో వచ్చిన సంస్థ ప్రతినిధులు ఎనిమిది యంత్రాలే ఉండడంతో సర్వీసింగ్ చేసి, మిగతా వాటి కోసం ఆరా తీసినా ఫలితం లేక అప్పటి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సూపరింటెండెంట్ జూన్ 19న జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్)కు రాతపూర్వకంగా సమాచారం ఇచ్చారు. దీనికి ఆయన డీఎంఈ పరిధిలోకి వచ్చినప్పుడు 2023 నవంబర్‌లో అన్ని వెంటిలేటర్లు అప్పగించామని బదులిచ్చారు. ఆ సమయాన పూర్తి సమాచారం రిజిస్టర్లలో పొందుపర్చిన నేపథ్యాన శనివారం రిజిస్టర్లు తనిఖీ చేసినా ఫలితం కానరాలేదని సమాచారం. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్ఓ బి.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా, ఆస్పత్రి అంతా పరిశీలిస్తే అన్నీ కలిపి 68 వెంటిలేటర్లు లెక్కకు వచ్చాయని తెలిపారు. అయితే, డీఎంఈ పరిధిలోకి వచ్చాక ప్రభుత్వం మరికొన్ని సరఫరా చేసిందని చెప్పారు. టెక్నికల్ ఇంజనీర్ సెలవులో ఉన్నందున సోమవారం ఆయన వచ్చాక బ్యాచ్ నంబర్ ఆధారంగా ఏ వెంటిలేటర్ ఎప్పటిదో సోమవారం వెల్లడి కానుందని వివరించారు.

నిలిచిన తపాలా సేవలు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా నిర్వహణలో నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్న క్రమాన శనివారం నుంచి పలు సేవలను నిలిపివేశారు. ఐటీ–2.0 పేరిట నూతనంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఈనెల 22వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో అమలు చేయనున్నారు. ఇందుకోసం మార్పులు చేయాల్సి ఉండడంతో శనివారం, సోమవారం పలు విభాగాల్లో సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో డిపాజిట్లు, విత్ డ్రాతో పాటుఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(ఐపీపీబీ) సేవలే కాక ఆధార్ ఆధారంగా నగదు విత్ డ్రా నిలిచిపోయింది. సురక్షితంగా, వేగవంతమైన సేవలందించేలా తపాలా శాఖ దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో ఐటీ–2.0 సాఫ్ట్‌వేర్ అమలుకు సిద్ధమైన అధికారులు, రెండు రోజుల పాటు లావాదేవీల్లో అంతరాయం ఏర్పడుతుందని ముందుగానే ప్రకటించారు. ఈమేరకు శనివారం ఖమ్మం తపాలా డివిజన్ కార్యాలయం, డివిజన్ పరిధిలోని 10 సబ్ డివిజన్ కార్యాలయాలు, ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం హెడ్ పోస్టాఫీసులే కాక 70 సబ్ పోస్టాఫీసులు, 750 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. తిరిగి 22వ తేదీ నుంచి అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. కాగా, ఉత్తరాల బట్వాడా మాత్రం కొనసాగుతోందని వెల్లడించారు.

విప్లవకారులంటే బీజేపీకి భయం

- అందుకే మృతదేహాలను అప్పగించడానికి వెనుకంజ
- బలానికి తగినన్ని సీట్లు ఇస్తేనే స్థానిక ఎన్నికల్లో పొత్తు
- సీపీఐ జిల్లా మహాసభల్లో కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, వేదికపై ఎమ్మెల్సీ సత్యం, నాయకులు

మధిర: విప్లవకారుల మృతదేహాలకు సైతం బీజేపీ నేతలు భయపడుతున్నారని.. విప్లవకారుల మృతదేహాలు కూడా ప్రజలను చైతన్యవంతులను చేస్తాయనే భయంతో వారిని హతమార్చాక కుటుంబీకులకు ఇచ్చేందుకు జంకుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. అయితే, విప్లవకారులను లేకుండా చేయడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా 23వ మహాసభలు శనివారం మధిరలో ప్రారంభం కాగా, తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, అమరవీరుల స్థూపాన్ని రాష్ట్ర నాయకుడు మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం సభలో కూనంనేని మాట్లాడుతూ బీజేపీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే వారిని లేకుండా చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఈక్రమంలోనే మావోయిస్టులను తుదముట్టిస్తామని అమిత్ షా ప్రగల్భాలు పలుకుతున్నారని తెలిపారు. ఇక ప్రజల పక్షాన పనిచేసే కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా అమల్లోకి వచ్చిన చట్టాలను రద్దు చేసేలా బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ నేపథ్యాన మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా, ప్రజల పక్షాన బహుముఖ పోరాటాలకు కమ్యూనిస్టులు ఐక్యం కావాలని కూనంనేని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేటి తరుణంలో పార్టీ శ్రేణులు ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. కాగా, అప్పుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో జాప్యం చేస్తే పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాదిరి అప్పుల నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలే తప్ప సంక్షేమం, అభివృద్ధి విషయంలో నాన్పుడు ధోరణి సరికాదన్నారు. స్థానిక ఎన్నికల్లో తమ బలానికి అనుగుణంగా సీట్లు కేటాయిస్తేనే ఏ పార్టీతోనైనా పొత్తు కుదుర్చుకుంటామని, లేకపోతే ఒంటరిగానే సత్తా చాటుతామని సాంబశివరావు తెలిపారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు

చారిత్రక పోరాటాలు పార్టీ సొంతం

స్వాతంత్రం వచ్చాక అనేక చారిత్రక పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించిందని, ఈక్రమంలోనే ఖమ్మం జిల్లా ఉద్యమ కేంద్రంగా బాసిల్లిందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. పార్టీ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసమే కాక తెలంగాణ ఉద్యమానికి సైతం మద్దతు ఇచ్చిన జాతీయ పార్టీగా సీపీఐ ఖ్యాతి గడించిందన్నారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా నిర్వహించే మహాసభల్లో భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృత చర్చ జరగాలని తెలిపారు. లౌకికవాదం, సోషలిస్టు పదాలను రాజ్యాంగం నుండి తొలగించేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కాగా, మహాసభలకు 600మందికి పైగా ప్రతినిధులు హాజరుకాగా సంతాప తీర్మానాన్ని సిద్దినేని కరుణకుమార్ ప్రవేశపెట్టాక మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కర్నాటి రామ్మోహన్‌రావు మాట్లాడారు. ఇంకా ఈ సభల్లో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఎంగల ఆనందరావు, ఎర్రాబాబు, ఎస్.కే.జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, బెజవాడ రవిబాబు, రహీమ్, వూట్ల కొండలరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధుల కట్టడి

జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న వెంకటరమణ

బోనకల్: సీజనల్ వ్యాధులు దరి చేరకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేసిన ఆయన గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వేపై ఆరా తీశారు. ప్రతీ ఏఎన్ఎం రోజుకు 25 రక్తనమూనాలు సేకరించాలని, ఫ్రైడే – డ్రైడేను పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు 0 – 40 ఏళ్ల లోపు గిరిజనులకు సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవంతి, ఉద్యోగులు వెంకట్రావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్సలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదు

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన వారితో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి శుక్రవారం రాత్రి సింగారెడ్డిపాలెం, అమ్మగూడెం, నేలకొండపల్లి నుంచి పలువురు వైద్యం కోసం వచ్చారు. అయితే, విధుల్లో వైద్యుడు, సిబ్బంది సకాలంలో పరీక్షించకుండానే ఖమ్మం తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిసింది. సింగారెడ్డిపాలెనకు చెందిన చిన్నారిని ముట్టుకోకుండానే ఖమ్మం తీసుకెళ్లాలని సూచించడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ శనివారం వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు వైద్యాధికారి కె.రాజేశ్‌ను వివరణ కోరారు. జిల్లా అధికారుల ఆదేశాలతో వైద్యుడికి షోకాజ్ నోటీస్ అందించనున్నామని తెలిపారు.

యూరియా కోసం రైతుల ఆందోళన




పీఏసీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వైరారూరల్: మండలంలోని పాలడుగు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు శనివారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని సొసైటీ గోదాము శిథిలావస్థకు చేరడంతో యూరియా నిల్వ చేసే పరిస్థితి లేక గ్రామానికి కేటాయించిన మూడు లారీల యూరియాను గొల్లపూడికి తరలించారు. ఇక శనివారం ఒక లారీ లోడ్ యూరియా చేరడంతో తీసుకునేందుకు రైతులు పోటీ పడ్డారు. గతంలో వచ్చిన మూడు లారీల లోడ్‌ను ఎవరికి, ఎప్పుడు పంపిణీ చేశారో చెప్పాలంటూ పెద్దసంఖ్యలో చేరుకున్న రైతులు సొసైటీ సిబ్బందిని నిలదీశారు. గతంలో మూడు లారీలను ఇంకో గ్రామానికి పంపించి, ఇప్పుడు ఒకే లారీ ఇక్కడకు తీసుకొస్తే ఎలా సరిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఒకటి, రెండు రోజుల్లో మరో లారీ లోడ్ యూరియా వస్తుందని సొసైటీ సిబ్బంది సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

అన్నిరంగాల్లో వాటా కోసం ఉద్యమించండి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: చైతన్యవంతమైన ఖమ్మంలో యాదవులు ఐక్యంగా ఉంటూ రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో హక్కుల కోసం మిగతా బీసీ వర్గాలతో కలిసి ఉద్యమించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక తొలిసారి శనివారం ఆయన ఖమ్మం రాగా, మధురానగర్‌లో తెలంగాణ యాదవ మహాసభ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. గోకులకృష్ణ సేవాసమితి భవనంలో బీసీ, యాదవ విద్యార్థుల కోసం రాయితీపై హాస్టల్ నిర్వహిస్తున్న కూరాకుల నాగభూషణం యాదవ్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. యాదవ మహాసభ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడి లింగయ్యయాదవ్, గుమ్మా రోశయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ మల్సూర్‌యాదవ్‌తో పాటు చిత్తారు ఇందుమతి, జడ మల్లేశ్, చావలి నాగరాజు, ముక్కాల కమల, కూరాకుల వలరాజు, బండి సత్యం, మూడుముంతల గంగరాజు, ఎర్రబోయిన గోవిందరావు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.17,463

అమ్మవారి సన్నిధిలో.. నక్షత్ర వనం

హిందూ సంప్రదాయంలో ప్రకృతిలోని పూలు, మొక్కలను దేవతామూర్తుల ప్రతిరూపాలుగా భక్తులు కొలవడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ప్రతీ పండుగలో వీటికి ప్రత్యేక స్థానం ఉంటుంది. భక్తులు తమ జన్మ నక్షత్రాల్లో ఏర్పడిన దోషాల నుంచి విముక్తి కోసం వాటికి ప్రతిరూపాలైన మొక్కలకు పూజలు చేయడం ద్వారా ఫలితం ఉంటుందని నమ్ముతారు. ఈ నేపథ్యాన భక్తుల మనోభావాలకు అనుగుణంగా పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సన్నిధిలో నక్షత్రాల ఆధారంగా వివిధ రకాల మొక్కలు నాటి వనంగా తీర్చిదిద్దారు. నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల పేర్లతో మొక్కలు పెంచి సంరక్షిస్తుండడంతో భక్తులు పూజలు చేస్తున్నారు. –పాల్వంచరూరల్

పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో 48 రకాల మొక్కలతో ఏర్పాటు

- నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల పేరుతో నాటి, సంరక్షణ
- మొక్కలకు పూజలు చేస్తున్న భక్తులు



వివిధ రకాల మొక్కలతో ఏర్పాటుచేసిన వనం (ఇన్‌సెట్) శతభిష నక్షత్రానికి చెందిన అరటి మొక్క

నక్షత్రాల వారీగా మొక్కలు ఇవే..

హిందూ సంప్రదాయంలో జాతక రీత్యా ఒక్కో రాశి వారు నిర్దేశిత మొక్కకు పూజిస్తే శుభ ఫలితాలు గోచరిస్తాయని నమ్ముతారు. ఇందులో భాగంగా అశ్విని నక్షత్రం వారు అడ్డసరం, భరణి నక్షత్రం వారు ఉసిరి, కృతిక – మేడి, రోహిణి – నేరేడు, మృగశిర – సండ్ర, ఆరుద్ర – రేల, పునర్వసు – వెదురు లేదా గన్నేరు, పుష్యమి నక్షత్రం – రావి, ఆశ్లేష – నాగకేసరి, జ్యేష్ఠ – దేవదారు, అనూరాధ – పొగడ, విశాఖ – నాగమల్లి, స్వాతి – మద్ది, చిత్త – మారేడు, హస్త – కుంకుడు, ఉత్తర – జువ్వి, పుబ్బ – మోదుగు, మఖ – మర్రి, మూల – వేగిస, పూర్వాషాడ – నిమ్మ, నారింజ, ఉత్తరాషాడ – పనస, శ్రవణా నక్షత్రం – తెల్లజిల్లేడు, ధనిష్ఠ – జమ్మి, శతభిషం – అరటి, పూర్వాభాద్ర – మామిడి, ఉత్తరాభాద్ర – వేపతో పాటు రేవతి నక్షత్రం వారు విప్ప మొక్కకు పూజ చేస్తే మంచిదని నమ్మిక.

రాశులు, గ్రహాల వారీగా..

ఇక రాశుల వారీగా మేషం – ఎర్రచందనం, వృషభం – ఏడుకాయల పాయ, మిథునం – పనస, కర్కాటకం – మోదుగు, సింహం – కలిగట్టు, కన్య – మామిడి, తుల – పొగడ, వృశ్చికం – సండ్ర, ధనస్సు – రావి, మకరం – జిట్రేగు, కుంభం – జమ్మి, మీన రాశి వారు మర్రి మొక్కకు పూజలు చేయాలని పండితులు చెబుతున్నారు. అలాగే, నవగ్రహాల్లో సూర్యుడికి జిల్లేడు, చంద్రుడికి – మోదుగు, కుజుడికి – చండ్ర, బుధ గ్రహానికి – ఉత్తరేణి, గురు – రావి, శుక్ర – అరటి, శని – జమ్మి, రాహువు – గరిక, కేతువు కోసం దర్భ మొక్కలు పూజలు చేశారని అంటున్నారు.

అన్నీ ఒకేచోట..

నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల్లో ఒక్కొక్క దాని కోసం ఒక్కో మొక్కకు పూజలు చేయాలని భావించే వారు ఆ మొక్క ఎక్కడ ఉందో వెదకడం ప్రయాసగా మారుతోంది. ఈ నేపథ్యాన పాల్వంచ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయ సన్నిధిలో అన్ని రకాల మొక్కలతో వనాన్ని తీర్చిదిద్దారు. ప్రతీ మొక్క వద్ద పేరు, అందుకు సంబంధించిన రాశి, నక్షత్రంతో కూడిన బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ పూజలు చేసేభక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

నేడు శాకాంబరీ దేవిగా పెద్దమ్మతల్లి..

పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారిని ఆదివారం శాకాంబరీదేవిగా అలంకరించనున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో భక్తులు, దాతల సహకారంతో వివిధ రకాల పండ్లు, కూరగాయాలతో అమ్మవారిని ఇలా అలంకరించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

దోషాలు తొలగిపోతాయి..



నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల్లో ఒక్కొక్కటి ప్రకృతిలోని మొక్కలతో ముడిపడి ఉంటాయి. జన్మనక్షత్రం దోషాలు తొలగిపోవాలంటే ఆయా చెట్ల చుట్టూ ప్రదక్షిణ చేయడం మంచిది. తద్వారా మంచి ఫలితాలు లభించడమే కాక దోషాల నుంచి విముక్తి కలుగుతుంది. – పద్మనాభశర్మ, వేద పండితుడు, పెద్దమ్మతల్లి ఆలయం

కడియం నుంచి తెప్పించాం..



అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు రావిచెట్టుకు ఊయలలు కట్టి పూజిస్తుంటారు. ఇదే క్రమాన నక్షత్రాలు, రాశులు, గ్రహాలకు సంబంధించి 48 మొక్కలను ఏపీ రాష్ట్రంలోని కడియం నుంచి తీసుకొచ్చి నాటాం. ఈ వనంలో పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. – ఎన్.రజనీకుమారి, ఈఓ, పెద్దమ్మగుడి

ఫేక్ అకౌంట్లు.. రూ.లక్షల్లో వసూళ్లు

గ్రామ పెద్దల సమక్షాన యువకుడికి జరిమానా

కామేపల్లి: మహిళ చిత్రాలతో సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు సృష్టించి చాటింగ్ చేసిన ఓ యువకుడు రూ.లక్షల్లో నగదు స్వాహా చేస్తున్న విషయం బయటపడింది. కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన సదరు యువకుడు ఐదు నెలల కిందట అదే గ్రామానికి చెందిన ఓ యువతి ఫొటోతో ఫేక్ అకౌంట్ సృష్టించి తమ కుటుంబ పరిస్థితి బాగాలేదంటూ వాయిస్ రికార్డును సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో నిజమేనని నమ్మిన పలువురు ఆయన చెప్పిన అకౌంట్‌కు నగదు బదిలీ చేస్తున్నారు. ఈ విషయం యువతి బంధువులకు చేరడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయినా తీరు మార్చుకోని యువకుడు తన దగ్గర పనిచేసే ఓ డ్రైవర్ పోస్టల్ సేవింగ్ ఖాతా వివరాలు తీసుకున్నాడు. ఆపై సామాజిక మాధ్యమాల్లో మరో నకిలీ అకౌంట్ సృష్టించి తప్పుడు సమాచారం ఇస్తూ ఆ ఖాతాకు నగదు బదిలీ చేయించుకుంటున్నాడు. ఈ మేరకు డ్రైవర్ ఖాతాలో రూ.లక్షల్లో నగదు జమ అయిందని తెలిసి గ్రామ పెద్దలకు చెప్పగా ఆరా తీయడంతో గతంలో మోసాలకు పాల్పడిన యువకుడే కారణమని తేలింది. దీంతో శుక్రవారం పంచాయితీ చేసి యువకుడికి జరిమానా విధించినట్లు సమాచారం. గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతోనే గ్రామపెద్దలు జరిమానా విధించినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌ఐ సాయికుమార్‌ను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



లాజరు (ఫైల్)

కల్లూరురూరల్: కల్లూరు మండలం పెద్దకోరుకొండికి చెందిన కోమటి లాజరు(35) మే నెల 12వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన బైక్‌పై వెళ్తుండగా గేదె తగిలి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో కల్లూరు, ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా శనివారం సాయంత్రం కనుమూశాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్టేషన్‌లో గుర్తుతెలియని యాచకుడు..



యాచకుడి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్ ఫాంపై గుర్తుతెలియని యాచకుడు(65) శనివారం మృతి చెందాడు. అనారోగ్యంతో ఆయన మృతి చెందినట్లు భావిస్తుండగా అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించామని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87125 69499, 98481 14202 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మెహందీ వేడుకల్లో సైన్స్!

చేతులపై మానవ అవయవాల బొమ్మలు



చేతిపై గుండె, బ్యాక్టీరియా నమూనా బొమ్మ

తిరుమలాయపాలెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మెహందీ వేడుకలు నిర్వహించారు. అయితే, చేతులపై గోరింటాకుతో సాధారణ డిజైన్లు కాకుండా జీవశాస్త్రం పాఠ్యాంశాల్లో బొమ్మలు వేశారు. మానవ గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు తదితర అవయవాలతో పాటు అమీబా, బ్యాక్టీరియా లాంటి కొన్ని సూక్ష్మజీవుల బొమ్మలు వేయించిన ఉపాధ్యాయులు వాటి ప్రత్యేకతలను వివరించారు. హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, శోభన, కృష్ణ, కళ, విజయలక్ష్మి, శేషఫణి, గోపమ్మ, ఏవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రఘుబాబు, అరుణ పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి విద్యార్థి గల్లంతు



సాయిదినేశ్

వేంసూరు: స్నేహితులతో కలిసి యాత్రకు వెళ్లిన విద్యార్థి గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా కాలేజీలో ఇటీవల బీటెక్ పూర్తి చేసిన వేంసూరు మండలం లచ్చన్నగూడెనకు చెందిన పామర్తి సాయిదినేశ్ స్నేహితులతో కలిసి ఏపీలో కోనసీమ జిల్లా వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వెళ్లాడు. తొలుత ముగ్గురు స్నేహితులతో కలిసి అక్కడ గోదావరి స్నానానికి దిగగా దినేశ్ గల్లంతైనట్లు తెలిసింది. దీంతో రెస్క్యూ టీంలు గాలింపు చేపట్టినా సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. ఈ మేరకు సమాచారం అందడంతో కుటుంబీకులు వాడపల్లి వెళ్లారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడుకు చెందిన గజ్జల ఆంజనేయులు(49) కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఇటీవల గుండెపోటు రాగా హైదరాబద్‌లో చికిత్స చేయించారు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోగా ఈనెల 18న కడుపునొప్పి రావడంతో పురుగుల మందు తాగాడు. దీంతో ఆంజనేయులును ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయన భార్య కనకమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ ముష్క రాజు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక డంప్ మాయం

తిరుమలాయపాలెం: మండలంలోని ముజాహిదిపురం శివార్లలో అక్రమంగా నిల్వ చేసిన 30 ట్రిప్పుల ఇసుక డంప్‌ను ఇటీవల రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేయగా.. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ధరావత్‌తండాకు చెందిన ధరావత్ రమేశ్, ధరావత్ రవీందర్ 30 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేసినట్లు తేలడంతో ఈ నెల 15న సీజ్ చేశారు. ఈ ఇసుకను శనివారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ విల్సన్ ప్రకటన విడుదల చేశారు. కానీ శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అందులో 25 ట్రిప్పుల మేర ఇసుకను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం వేలంపాటకు సిద్ధమైన అధికారులు ఇసుక లేకపోవడంతో అవాక్కయ్యారు. దీంతో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆ సీఐ వ్యవహారంపై విచారణ

ఖమ్మంక్రైం: ఖమ్మంలో శుక్రవారం మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఆర్‌బీ సీఐ హడావుడి చేసిన అంశంపై పత్రికల్లో కథనాలు రావడం పోలీస్ శాఖలో చర్చకు దారి తీసింది. సదరు సీఐ వ్యవహారశైలిపై శాఖాపరంగా విచారణ మొదలుపెట్టినట్లు తెలిసింది. ఆయన తీరుపై నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఈమేరకు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ, ఖమ్మం పోలీస్ కమిషనర్ వేర్వేరుగా నివేదికలు ఇవ్వగా, సీఐకి భద్రాద్రి ఎస్పీ మెమో జారీ చేసినట్లు తెలిసింది.

యాప్ నిర్వాహకుల వేధింపులతో ఆత్మహత్య



ముత్యాల హరీశ్ (ఫైల్)

వేంసూరు: లోన్ యాప్‌లో అప్పు తీసుకున్న యువకుడిని నిర్వాహకులు వేధిస్తుండడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తుపల్లి మండలం తుమ్మూరుకు చెందిన ముత్యాల హరీశ్ (25) వేంసూరు మండలం దుద్దెపూడిలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆయన యాప్ ద్వారా రూ.5,411 అప్పు తీసుకోగా, రూ.9 వేలు చెల్లించాలని నిర్వాహకులు బెదిరించారు. అంతేకాక ఆయన ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫోన్ కాంటాక్టుల ఆధారంగా పలువురికి పంపించడంతో మనస్తాపానికి గురై గురువారం పురుగులమందు తాగాడు. ఆపై కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో వారు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై హరీశ్ తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సరళ

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో పెరిగిన మతోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు శనివారం రెండో రోజుకు చేరగా, సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద రోజుల్లో నిత్యావసరాల ధరలు తగ్గిస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనాన్ని వెలికి తీస్తానని ఇచ్చిన హామీలను బీజేపీ విస్మరించగా, మహిళలు, బాలికలపై దాడులు పెరిగాయని పేర్కొన్నారు. అంతేకాక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని ఆరోపించారు. అలాగే, ఆదాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం, పబ్బులు, అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఇకనైనా మహిళా సాధికారితకు చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, నాయకులు బండి పద్మ, ఎండీ మెహరున్నీసాబేగం, పి.నాగసులోచన, పి.ప్రభావతి, పి.సుమతి, శీలం కరుణ, కె.అమరావతి, జి.సునీత, జి.రజిత, బెల్లం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

బోనకల్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. బోనకల్ మండలం రాపల్లిలో పరుచూరి సుజాతకు ఇల్లు మంజూరు కాగా, స్థలవిషయమై వివాదం తలెత్తడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన డీపీఓ వివాదం ఉన్న స్థలంలో కాకుండా సొంత స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. మిగతా లబ్ధిదారులు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపడితే బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కాగా, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ అందుబాటులో ఉండడం లేదని, ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి డబ్బు అడగడమే కాక జీపీ ట్రాక్టర్‌ను ప్రైవేట్ పనులకు వినియోగిస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టాలని ఎంపీఓ శాస్త్రికి సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను డీపీఓ పరిశీలించారు.

లక్ష్యంతో చదివితే ఉన్నత స్థాయికి..



స్కాలర్‌షిప్ అందుకున్న వారితో వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు

మాజీ వీసీ వీరారెడ్డి, రిటైర్డ్ ఐఆర్ఎస్ భాస్కర్‌రెడ్డి

ముదిగొండ: విద్యార్థులంతా స్పష్టమైన లక్ష్యాలను ఏర్పర్చుకుని శ్రద్ధగా చదివితే ఉన్నత స్థాయికి ఎదగొచ్చని శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కడారు వీరారెడ్డి తెలిపారు. ముదిగొండ మండలం బాణాపురంలో శనివారం జరిగిన ఆవుల అమ్మిరెడ్డి ఫౌండేషన్ తరఫున స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఆవుల భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నందున నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. వసతులను సద్వినియోగం చేసుకుంటూ కమశిక్షణతో చదివితే ఎంచుకున్న రంగంలో అభివృద్ధి సాధించొచ్చని చెప్పారు. కాగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేలా ఆవుల అమ్మిరెడ్డి పేరిట స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా ముదిగొండ మండలంలోని 15 ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చూపిన 89 మందికి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఆవుల భాస్కర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, తహసీల్దార్ సునీత ఎలిజబెత్, కమిటీ సభ్యులు వట్టికూటి వెంకటేశ్వర్లు, పూర్ణచందర్‌రావు, రామారావు, బాణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈ.వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు?

కామేపల్లి: మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నారనే అనుమానంతో ముగ్గురు యువకులను కామేపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కామేపల్లి మండలం జాస్తిపల్లి, ముచ్చర్లకు చెందిన ఇద్దరితోపాటు గార్ల మండలానికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్‌ఐ సాయి కుమార్ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.